# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





# - 182 -

## మూడు వారాలూ, మూడు నగరాల కథ

కిందటి నెల...అంటే ఫిబ్రవరి 2023 లో నేనూ, క్వీన్ విక్టోరియా చెట్టాపట్టలు వేసుకుని అమెరికా పశ్చిమ తీరానికి విమాన ప్రయాణం చేశాం. కోవిడ్ ప్రభావం ఇంకా అక్కడా ఇక్కడా ఉంది అనడానికి నిదర్శనం ఆ విమానం నడిపే పైలట్లూ, లోపల కాఫీలూ, టిఫినీలూ ఇచ్చే అమ్మాయిలలో కొందరూ, ప్రయణీకుల్లో కొందరూ మాత్రమే ఆ దిక్కుమాలిన 'ముఖం గోచీ 'లు ....అనగా ముఖాలు మంచివే కానీ గోచీలు మాత్రమే దిక్కుమాలినవి అని గమనించాలరు....పెట్టుకున్నారు. వాటిని "గోచీ మొహం" అని కూడా మనం పిలుచుకోవచ్చును. మేమిద్దరం అలాంటి గోచీ మొహాలు కాకుండా ఫుల్ మేక్ అప్ సహా ముఖ సౌందర్యం అంతానో, కొంత మాత్రమేనో కనపడేలా మాస్క్ లు లేకుండానే ప్రయాణం చేశాం. ఇక్కడ 'అంతా' అంటే ఆమె తాలూకు అనీ, 'కొంత' అంటే నాదీ అని గమనించగలరు. కానీ ప్రతీ విమానాశ్రయం లోనూ నా జాతకమో ఏమిటో తెలీదు కానీ చెక్ ఇన్ కౌంటర్ దగ్గర నుంచి మేము ఎక్క వలసిన గేట్ ఎప్పుడూ ఎక్కడో ఆఖర్న రెండు మైళ్ళ నడకలోనే ఉంటుంది. మళ్ళీ దిగిన గేట్ కూడా ఆఖర్నే ఉండి అక్కడ నుంచి పెట్టెలు తీసుకునే చోటు దాకా మరో రెండు మైళ్ళు ఉంటుంది. ఈ నడక నుంచి తప్పించుకోడానికి వాళ్ళు ఉచితంగా ఏర్పాటు చేసే చక్రాల కుర్చీలో...ఒక్క కుర్చీలో ఇద్దరమూ కాదు..ఎవరి కుర్చీ వాళ్లదే... మేము ఇద్దరం టింగు రంగా మని సెక్యూరిటీ వాళ్ళ చెకింగ్ లు సునాయాసంగా దాటేసి వెళ్ళగలిగినా ఈ సరదా వేరు వేరు కుర్చీలు కాబట్టి ఈ చెట్టా పట్టాలు వేసుకోవడం కుదర లేదు. ఏమాటకామాటే చెప్పుకోవాలి కాబట్టి నడుస్తున్నప్పుడు కూడా నేను సరదాగా క్వీన్ విక్టోరియా చెయ్యి పట్టుకోవడం, ఆవిడ "ఛీ, వదులు. ఎవరయినా నవ్వుతారు" అని విసిరి కొట్టడం, అది చూసి చుట్టూ ఉన్న అమెరికా 'యూతు పిల్లలు' వాళ్ళ చేతులు ఇంకా గట్టిగా చెట్టా పట్టాలు వేసేసుకుని నవ్వేసుకోవడం కూడా ఎప్పుడూ జరిగిన తతంగమే. ఎంతయినా ఆవిడ పవిత్ర భారత నారీమణి కదా! పబ్లిగ్గా మొగుడి చెయ్యి పట్టుకుంటే,,వామ్మో!.

మా మొదటి మజిలీ సియాటిల్ నగరంలో మా మేనల్లుడి ఇల్లు. వీడు ఒక టెక్నాలజీ లో అనేక వీర తాళ్ళు వేసుకున్న వీరుడు మరియు నక్షత్రాల ప్రేమికుడు. అంచేత చిన్న కొండ మీద సమామీష్ సరస్సు కనపడేటట్టు కొనుక్కున్న

ఇంట్లో చెక్క డాబా..అంటే చెక్క ముక్కల డెక్కు...దానిమీద రెండు పెద్ద టెలిస్కోపులు ఉంటాయి. రోజూనో, అప్పుడప్పుడూనో వాడు, భార్యా, ముగ్గురు పిల్లలూ ఆ డెక్ మీద కూచుని ఆ టెలిస్కోపుల లో బిలియన్ అండ్ బిలియన్ మైళ్ళ దూరంలో ఉన్న నక్షత్రాలూ, గ్రహాలూ, నెబ్యులాలూ, పాల పుంతలూ అలా ఎక్కడా కథలూ, కమామీషులూ రాసే మానవ మాత్రులు బతికి బట్ట కట్ట లేని ప్రాంతాలకి ఫొటోలు తీస్తాడు. చెప్పొద్దూ, వాడు ఎంతో కుతూహలంగా చూపించిన ఆ గతుకుల బొంతల బొమ్మలూ, ఎర్రగా మడుతున్న బొమ్మలని చూపించి "ఇది చంద్రుడు మావయ్యా,", "ఇది వీనస్, అత్తయ్యా" అని చూపిస్తుంటే ఇక "లాహిరి లాహిరి లో" ఎలా గుర్తుకొస్తుంది చెప్పండి. మేము అక్కడ ఉన్న మూడు రోజులూ ఎప్పటిలాగానే అక్కడ పొలో మని ఒహటే వర్షం. గొడుగేసుకుని నక్షత్రాలు చూడవలసి వచ్చింది. "నువ్వు చూసి నాకు చెప్పు" అని నాలుగైదు సార్లు నన్ను ఇరికించి తను లోపలికి వెళ్ళి పోయింది మా క్వీన్ విక్టోరియా. ఆ మూడు రోజులలోనూ ప్రముఖ రచయిత్రి నిహారిణీ కొండపల్లి గారు వచ్చి, పలకరించి, తన కవితా సంకలనం బహూకరించి వెళ్ళడం చాలా ఆనందం కలిగించింది. అలాగే ఇది వరలో హ్యూస్టన్ లో ఉండి సియాటిల్ లో స్థిరపడిన రఘు ధూళిపాళ & శ్రావణి వారి ఇంటికి తీసుకెళ్ళితే అక్కడ పకోడీలు సేవిస్తూ పాత కబుర్లు నెమరు వేసుకున్నాం. పాపం, రఘు మమ్మల్ని అంత వర్షం లోనూ అక్కడ జలపాతాలు చూపించి నగరం అంతా చూపించాడు.

తర్వాత మజిలీ కేలిఫోర్నియా లోని బే ఏరియా ప్రాతం. అక్కడ మా చిన్నన్నయ్య రెండో కొడుకు ఉన్నాడు. వాడు అమెరికా వచ్చిన కొత్తలో హ్యూస్టన్ లో మా ఇంట్లో ఉండి చదువుకున్నాడు. ఇప్పుడు బాగా సెటిల్ అయి, ఇద్దరు పిల్లలతో సొంత ఇంట్లో ఉంటున్నా, మేము వాడి సంసారం చూడడం ఇదే మొదటి సారి. అంచేత పాపం నెత్తి మీద పెట్టుకుని ఎంతో గౌరవం చేశాడు. అయితే ఇక్కడికి వచ్చిన అసలు పని మరొకటి ఉంది. నేను ప్రస్తుతం ఎమ్. ఏ. (తెలుగు) చదువుతున్న సిలికానాంధ్రా విశ్వవిద్యాలయం స్వయంగా చూడడం ఇక్కడికి రావడానికి మరొక ముఖ్య కారణం. నాకు ఎంతో ఆత్మీయుడూ, ఆ విశ్వవిద్యాలయ అధ్యక్షుడూ అయిన ఆనంద్ కూచిభొట్ల తో ఆ ప్రాంగణంలో ఒక రోజంతా గడపడం ఒక్క మంచి అనుభూతి. మాతో బాటు ప్రముఖ రచయిత మృత్యుంజయుడు గారూ, విశ్వవిద్యాలయం కార్యదర్శి & డైరెక్టర్ శ్రీ దేవి గంటి, కంప్యూటర్ సైన్సెస్ ప్రొఫెసర్ వెంకట్ గుడివాడ గారూ రోజంతా అనేక ముఖ్యమైన విషయాల మీద చర్చించుకున్నాం. అన్నీ ఆచరణ యోగ్యమైన ఆలోచనలే. పనిలో పనిగా ఎమ్. ఏ. లో నా "తెర మేట్" సహాధ్యాయి కిరణ్ సింహాద్రి ని వ్యక్తిగతంగా కలిసి అతని టెస్లా కారులో కబుర్లు చెప్పుకోవడం భలే బావుంది.

ఆ మర్నాడు నేను గీతమ్మ అని పిలుచుకునే ప్రముఖ రచయిత్రి డా. కె. గీత ఇంటికి వెళ్ళి ఎంతో ఆనందంగా కబుర్లు చెప్పుకున్నాం. ఎంతో విశాలంగా, పొందికగా, వెనకాల మంచి తోటతో గీత ఇల్లు చాలా అందంగా ఉంది. ఆ దంపతుల ఆత్మీయత అంత కన్నా భలే బావుంది. గీత తన "అసింట" అనే కొత్త కవితా సంపుటి మాకు బహూకరించింది.



ఆ సాయంత్రం గీతమ్మ ఆధ్వర్యం లోనే గురుతుల్యులు, సుప్రసిద్ధ సాహితీవేత్త డా. వేమూరి వెంకటేశ్వర రావు & ఉమ గారి స్వగృహంలో ఒక ముఖా ముఖీ కార్యక్రమం జరిగింది. సుమారు 25 మంది దాకా వచ్చిన ఆ ఆత్మీయ సమావేశంలో చాలామంది మా క్వీన్ విక్టోరియాని చూడడం కోసమే వచ్చారని అక్కడికి వెళ్ళగానే నాకు అర్ధం అయిపోయింది. "ఇలాంటి వాడిని ఎలా భరిస్తున్నారూ?" "అతడి అవాచవాకులూ మీరు ఎప్పుడైనా అసలు చదివారా?.....ఇలాంటి ప్రశ్నలు ఆవిడని అడిగినట్టు కనపడకుండానే అడిగేసి తమ అనుమానాలు తీర్చేసుకున్నారు. అంతా అయ్యాక "అయ్యో పాపం" అని కొందరు నిట్టూర్చడం నేను చూడనే చూశాను. ఈ సమావేశానికి మన 'కౌముది' సంపాదకులు కిరణ్ ప్రభ & కాంతి దంపతులు, శారద కాశీవఝ్ఝుల. మృత్యుంజయుడు & జయమాల, మీరా సుబ్రమణ్యం గారు, సుభాష్, కాట్రగడ్డ రజని, బాల కృష్ణారెడ్డి దంపతులు, వేమూరి శ్రీరామ్ దంపతులు, చిరకాల మిత్రులు తల్లాప్రగడ రావు గారు మొదలైన వారు రావడం మాకు ఎంతో ఆనందం కలిగించింది అని వేరే చెప్పక్కర లేదు. అందరి పేర్లూ గుర్తు పెట్టుకోలేక పోయినందుకు మన్నించండి.

బే ఏరియా తర్వాత ఝూం అని లాస్ ఏంజెలెస్ లో మా తమ్ముడింటికి వెళ్ళిపోయాం. అక్కడ మూడు రోజులు ఇంటిపట్టునే ఉండి, కబుర్లు చెప్పేసుకుని మళ్ళీ హ్యూస్టన్ లో మా ఇంటికి వచ్చి పడ్డాం. గత సెప్టెంబర్ లో న్యూజీలండ్ పర్యటన పక్కన పెడితే కోవిడ్ తర్వాత అమెరికాలో అంతేసి దూరాలు అన్ని రోజులు వెళ్ళి రావడం, ఆత్మీయులని కలవడం భలే ఆనందంగా ఉంది. ఆయా ఫొటోలు వీలుంటే ఎఫ్ బీ లో పెడతాను. వచ్చే నెల మళ్ళీ కలుద్దాం.

**COMMENTS**